క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

బోనకల్: సీజనల్‌గా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి అన్నారు. మండల కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించారు. కాచి చల్లార్చిన నీళ్లను తాగాలని, ఎప్పటికప్పుడు వండుకున్న వేడి పదార్థాలను తినాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

కల్లూరురూరల్: రైతులు ఎరువులు, విత్తనాలను విక్రయించే క్రమంలో దుకాణాదారులు తప్పకుండా రసీదులు ఇవ్వాలని ఏఓ రూప అన్నారు. సోమవారం కల్లూరు సమీపంలోని జిడిపిపల్లిలో గల ఎరువులు, విత్తన దుకాణాలను ఏఓ రూప తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో గల ఈపీఓఎస్ మిషన్లలో ఉన్న స్టాకు గోడౌన్‌లో ఉన్న స్టాక్‌లు సరిపోను ఉన్నాయా.. లేవా? అనే విషయాన్ని పరిశీలించారు. ఎరువులు రైతులకు విక్రయించే సమయంలో ఆధార్‌కార్డు తప్పని సరిగా నమోదు చేయాలని కోరారు. దుకాణాలకు వచ్చిన స్టాకును రిజిస్టర్లలో నమోదు చేసిన స్టాకులను కూడా పరిశీలించారు.

ముగిసిన సీపీఎం శిక్షణా తరగతులు

వైరారూరల్: మండలంలోని పాలడుగులో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సీపీఎం శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీనియర్ సీపీఎం నాయకులు షేక్.అబ్దుల్, షక్.రెహమాన్, షేక్.మౌలాలి, యాకుబ్ అలీ, వనమా చిన్న సత్యనారాయణలను శాలువాలతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సీపీఎం నాయకుల అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మజీద్, షైహినాబీ, రహీనా తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు వైద్యశిబిరం

పెనుబల్లి: మండలంలోని చౌడవరం శివారు అటవీ ప్రాంతం ఆదివాసీలకు లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి చింత కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కొంత మంది ఆదివాసీలు డాక్టరు ఇచ్చిన మందులు మింగడానికి నిరాకరించడంతో వారితో మాట్లాడి ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ప్రకాశరావు, ఏఎన్‌ఎం కుమారి, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

పెనుబల్లి: భవన నిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లంకపల్లిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డు నందు కార్మికులు సభ్యత్వం రూపంలో కట్టిన డబ్బులు రూ.800 కోట్లు ఉన్నాయని.. వాటిని కార్మికుల శ్రేయస్సు కోసం ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో బాబు, హరి, చిన్నరాజి, వెంకటేశ్వరరావు, మస్తాన్, శ్రీనివాసరావు, నాగరాజు, ఆనందరావు, నాగేశ్వరరావు, రజిని పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత


మృతుడు శ్రీనాథరాజు కిరణ్ (ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరురూరల్: మండలంలోని చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాథ రాజు కిరణ్ విద్యార్థి గత శనివారం అమెరికాలో చనిపోయిన విషయం విదితమే. ఈ సంఘటనకు 'సాక్షి' దిన పత్రికలో ప్రచురించడంతో.. మృతుడిని ఇండియాకు తరలించడానికి మృతుడి స్నేహితులు మాదిరాజు శ్రీనివాసరావు, కంపటి ఆంజనేయులు, మర్లపాడుకు చెందిన రెడ్డిచర్ల హనుమంతు, తిరుమలశెట్టి గోపి మృతుడి విషయాన్ని వైరల్ చేశారు. దీంతో మరింత మంది దాతలు ముందుకువచ్చి సుమారు రూ.20 లక్షలు సమకూర్చినట్లు తెలిసింది. మృతదేహం మంగళవారం రాత్రి ఇండియాకు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది.

పించన్ ఇవ్వాలి

వేంసూరు: 60ఏళ్లు నిండిన ప్రతి పెయింటర్‌కు ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ అన్నారు. మండలంలోని కందుకూరులో ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పెయింటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పిల్లిభాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పెయింటర్ల సమావేశాలకు కమ్యూనిటీహాల్ నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, కృష్ణ, ప్రశాంత్, పిచ్చియ్య, మార్క్, రవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాంబయ్య పాల్గొన్నారు.


కళాశాలలో బొటానికల్ గార్డెన్


ఎన్‌సీసీ క్యాడెట్లు.. (ఫైల్)


ల్యాబ్‌లో..

కళాశాల.. పిలుస్తోంది..

- అన్ని హంగులతో.. ఆదర్శంగా జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ
- స్వర్ణోత్సవాలకు అడుగులు..


సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సత్తుపల్లిటౌన్: ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది.. అన్ని హంగులతో స్వర్ణోత్సవాలకు రెండు అడుగుల దూరంలో సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భాసిల్లుతోంది. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభావంతులుగా నిలుపుతూ ఆదర్శంగా నిలుస్తోంది. పచ్చని ప్రశాంత వాతావరణంలో 12.25 ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన తరగతి గదులు, సువిశాలమైన క్రీడా ప్రాంగణం, అధునాతన ప్రయోగశాలలు, నూతన సాంకేతికత కల్గిన కంప్యూటర్ ల్యాబ్స్ ఈ కళాశాల ప్రత్యేకత. ఈ విద్యా సంవత్సరం నుంచి అటానామస్ కళాశాలగా రూపుదిద్దుకునేందుకు అడుగులు వేస్తుంది.

రూ.4 కోట్లతో అదనపు గదులు..

రూసా(రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్) పథకం ద్వారా రూ.4 కోట్ల నిధులతో అదనపు తరగతి గదులు, వర్చువల్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక సదుపాయాలు కలిగి 765 మంది విద్యార్థులకు విద్య నేర్చుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ చదువుల తల్లిగా విరాజిల్లుతోంది. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను 1979లో స్థాపించగా ప్రతిష్టాత్మకమైన న్యాక్-ఏ గ్రేడ్ గుర్తింపును సైతం పొందింది.

నగదు ప్రోత్సాహకాలతో..

కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మల్లిక ఛారిటబుల్ ట్రస్ట్, పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఏటా అన్ని గ్రూపుల విద్యార్థులకు ప్రతిభ, నగదు పురస్కారాలు, బహుమతులు అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించటానికి యోగా, మెడిటేషన్ తరగతులు, క్షేత్ర పర్యటనల ద్వారా స్వీయ అనుభవాధ్యయనం చేస్తున్నారు.

26వేల పుస్తకాలతో..

కంప్యూటర్ టీఎస్ స్కిల్స్ లాలెడ్జి సెంటర్‌తో పాటు 26వేల వరకు అకాడమిక్ పుస్తకాలు, కంపిటేటివ్ జర్నల్స్, పోటీ పరీక్షల పుస్తకాలతో కూడిన కళాశాల గ్రంథాలయం ఉంది. అదే విధంగా ఈ లైబ్రరీలో ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తూ డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దారు. ఉచిత వైఫైవ్ సేవలు అందిస్తున్నారు. విద్యార్థులు శారీరక ధారుఢ్యం పెంచుకునేందుకు జిమ్ సౌకర్యం కూడా ఉంది. టి.శ్యాట్ ద్వారా యూనివర్సిటీ ప్రొఫెసర్లతో విద్యాబోధన జరుగుతుంది. మూడు డిజిటల్ క్లాస్ రూంలు, ఒక స్మార్ట్ క్లాస్‌రూం ఉన్నాయి. సీసీ కెమెరాలు కళాశాలను నిత్యం పర్యవేక్షిస్తుంటాయి. విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకం, వెనుకబడిన విద్యార్థుల కోసం రెమిడియల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా 15కేవీ సోలార్ విద్యుత్ ప్లాంట్, 10 కేవీ, 5కేవీ యూపీఎస్‌లు కళాశాలలో ఏర్పాటు చేశారు.

ప్రత్యేకతలు ఇవే..

ఇటీవల కళాశాల గ్రీన్ ఛాంపియన్ జిల్లాస్థాయి అవార్డు సాధించింది. జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అంతర్జాతీయ స్థాయిలో రాక్‌బాల్ పోటీలలో కళాశాల విద్యార్థి ప్రథమ స్థానం సాధించగా.. జాతీయ స్థాయి కరాటే పోటీలో బంగారు పథకాలు లభించాయి. కళాశాలలో ఎంఫిల్, పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో తరగతుల నిర్వహణ, బాలికల కోసం ప్రత్యేకంగా వెయిటింగ్‌హాల్, ఒక ఎన్‌సీసీ యూనిట్, రెండు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఉమెన్ ఎంపవర్‌మెంట్ విభాగంతో బాలికలకు ప్రత్యేకంగా ఉచిత కరాటే శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి సదుపాయాలు ఉన్నాయి. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండటంతో వాలీబాల్, ఫుట్‌బాల్, ఖో-ఖో క్రీడల్లో కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో రాణిస్తున్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి..



ఈ కళాశాలలోని అత్యాధునీక ల్యాబ్‌లతో పాటు ఆధునీక సదుపాయాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దోస్తు వెబ్ ఆప్షన్‌లో కళాశాలను ఎంపిక చేసుకోండి. ఈ కళాశాలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. పీజీలో ఎంకాం కోర్సు అందుబాటులో ఉంది. బాలికల కోసం ప్రత్యేకంగా హాస్టల్ సదుపాయం ఉంది.

– సీహెచ్ విజయ్‌కుమార్, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సత్తుపల్లి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ హరిప్రసాద్, తదితరులు

వైరాలో వనమహోత్సవం..

వైరా: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. సోమవారం వైరాలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, జూనియర్ కళాశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కనాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, కళాశాల ప్రిన్సిపల్ విజయ కుమారి, వైస్ ప్రిన్సిపల్ కుసుమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మేడేపల్లిలో..

ముదిగొండ: మండలంలోని మేడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్ ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని, మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ కోరారు. మనం మొక్కలు నాటితే అవి మనకు బతికేందుకు స్వచ్ఛమైన వాయువును అందిస్తాయని ప్రతి విద్యార్థి విధిగా మొక్కలు నాటి వాటిపి పెంచి పోషించాలని ఎంపీపీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ పూర్ణయ్య

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పీవీ శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డీలక్స్ బస్సుల్లో మహిళలకు గిఫ్ట్ స్కీం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నుంచి విజయవాడ రూట్‌లో ఆరు డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఈ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం పథకాన్ని మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నామని సత్తుపల్లి డీఎం యు.రాజ్యలక్ష్మి వెల్లడించారు. స్థానిక డీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రయాణం ముగిసిన తర్వాత టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి డ్రైవర్ వెనుక ఉన్న గిఫ్ట్‌బాక్స్‌లో టిక్కెట్లు వేయాలన్నారు. ప్రతీ 15 రోజులకోసారి రీజియన్ స్థాయిలో ఖమ్మంలో విజేతలను ప్రకటించి ముగ్గురుకి బహుమతులు అందిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంఎఫ్ సాహితి, వీబీఓ కిన్నెర ఆనంద్ ఉన్నారు.

సీయూఈటీలో విదార్థిని ప్రతిభ


భూమిక

ముదిగొండ: ముదిగొండకు చెందిన కమర్తపు భూమిక సీయూఈటీలో 24వ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఆమె కామన్ యూనివర్సిటీలో ఆల్ ఇండియాలో 24వ ర్యాంకు సాధించి.. ఢిల్లీలోని జెఎన్‌టీయూ ఎం.ఏ.సోషియాలజీలో సీటు సాధించింది. దీంతో తల్లిదండ్రులు నిరంజన్, సుజాత సంతోషాన్ని వ్యక్తం చేయగా.. గ్రామస్తులు అభినందించారు.

తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి


అధ్యక్షుడు కృష్ణారెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కత్తి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక తాపీ వర్కర్స్‌యూనియన్ భవనంలో సోమవారం జరిగిన యూనియన్ ఎన్నికల్లో 418 ఓట్లకు గాను 250 ఓట్లు పోల్ అయ్యాయి. కృష్ణారెడ్డికి 101 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి బొర్రా నాగయ్య 67 ఓట్లు వచ్చాయి. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు ఎస్‌కె నజీర్, యూనియన్ బాధ్యులు ఎస్‌కె మైబు, పిడుగు వెంకటేశ్వరరావు, సుబ్బారావు, మహేష్, గుంజా వెంకటేశ్వరరావు, మధు, ఖాసీం, శ్రీను, బ్రహ్మారెడ్డి, లక్ష్మారెడ్డి, అహ్మద్, కమలాకర్, పోలయ్య పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

సత్తుపల్లిరూరల్: భవన నిర్మాణ కార్మికులను తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్ కోరారు. స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సర్వేశ్వరరావు, కృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, హరి, రాము పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. జీసీసీ నుంచి పాఠశాలలకు నాసిరకం సరుకులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాములు, హరిచంద్, పవన్ పాల్గొన్నారు.

3న సత్తుపల్లికి ముగ్గురు మంత్రుల రాక


డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి: వనమహోత్సవంలో భాగంగా ఈ నెల 3న సత్తుపల్లికి రాష్ట్ర అటవీశాఖా మంత్రి కొండా సురేఖ, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. సోమవారం స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న సభా వేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముగ్గురు మంత్రులతో పాటు పదివేల మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. వనమహోత్సవంలో భాగంగా ముగ్గురు మంత్రులు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కనరోడ్‌లో మొక్కలు నాటుతారని తెలిపారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, ఎఫ్‌డీఓ మంజుల, ఏసీపీ రఘు, జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె చెన్నారావు, ఎండీ కమల్‌పాషా పాల్గొన్నారు.

గంగమ్మతల్లి గుడి ద్వారబంధం ప్రతిష్ఠ


గంగమ్మతల్లి గుడి వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కారేపల్లి: కారేపల్లిలోని సుబ్బయ్యకుంట చెరువు ఒడ్డున నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయానికి గ్రామస్తులు ద్వారబంధం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా చేపట్టారు. పూజారి నాగసాయిశర్మ మంత్రోచ్ఛరణల నడుమ గ్రామస్తులు మామిడి తోరణాలను కట్టారు. అనంతరం హోమ కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, సీఐ ఎస్ రాజారాంలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, రామస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీను, మల్లయ్య, రాంబాబు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్, బల్లలు..

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద మహిళకు కుట్టుమిషన్, సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రామసీత జీవనోపాదికొరకు జవ్వాజి నగేష్, మిట్టపల్లి నరసింహారావు సంయుక్తంగా కుట్టుమిషన్ అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి 20 సిమెంట్ బల్లలను నారాయణపురం, తల్లాడ గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ కర్నాటి లక్ష్మారెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, కనకదుర్గా ప్రసాద్, కటికి వెంకటేశ్వర్‌రావు, శీలం వెంకట్‌రెడ్డి, రాయల గోవిందరావు, డీసీ పులబాల వెంకటేశ్వర్లు, రాయల గోవిందరావు, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల గ్రేస్ చిల్డ్రన్స్ స్కూల్‌లో చిన్నారులకు యూనీఫాం, నోట్ పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేస్ యాజమాన్యం అందజేస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రేస్ సర్వీసెస్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎల్ ప్రసాద్, డైరక్టర్ అజయ్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీవేణు, హెచ్‌ఎం వాణి తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ

వేంసూరు: మండల పరిధిలోని లింగపాలెం యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న గండ్ర జయ జన్మదిన వేడుక సందర్భంగా సోమవారం లయిన్ గండ్రసోమిరెడ్డిజయ దంపతులు పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, పలకలు పెనిళ్లు వితరణగా అందించారు. వీటిని ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యర్ర సత్యం, యర్ర రమేష్, వెల్ది ప్రసాద్, ఉపాధ్యాయులు నిర్మల, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్..


విద్యార్థిని అనుకి ల్యాబ్‌టాప్ అందజేస్తున్న జయసోమిరెడ్డి

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని కదారి అనుకి రూ.35వేల విలువైన ల్యాబ్‌ట్యాప్‌ను లింగపాలెం ఉపాధ్యాయురాలు గండ్ర జయసోమిరెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో గండ్ర సోమిరెడ్డి, శివప్రసాద్, దారా కృష్ణారావు, మురళీకృష్ణ, ప్రభాకర్‌రావు, కృష్ణయ్య, రమేష్, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

భట్టికి వేలంగని మాత విగ్రహం బహూకరణ


భట్టి విక్రమార్కకు విగ్రహాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉన్నత స్థానంలో ఉండాలని కోరుకుంటూ తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలోని ప్రసిద్ధి చెందిన వేలంగని మాత దేవాలయంలో ఇటీవల ఎర్రుపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మొక్కిన మొక్కు తీర్చుకున్నారు. కాగా ఆ దేవాలయం నుంచి తెచ్చిన వేలంగని మాత విగ్రహాన్ని సోమవారం భట్టి విక్రమార్కను మధిర క్యాంపు కార్యాలయంలో కలిసి బహూకరించారు. విగ్రహం బహుకరించిన వారిలో నాయకులు దేవరకొండ రాజీవ్‌గాంధీ, దేవరకొండ శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, వెంకటరత్నం, అనీల్ కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంసూరు: మండల పరిధిలోని గూడురులో 33కేవీ లైన్ నిర్మాణ, మరమ్మతుల నిమిత్తం గూడురు, భీరపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం9 గంటల నుంచి 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ జొన్నలగడ్డ అనీల్ కుమార్ సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కొణిజర్ల: మండలంలోని గద్దలగూడెం గ్రామానికి చెందిన గుడిపూడి రాజేశ్వరరావుకు చెందిన పాడి గేదెను మేత కోసం పొలానికి తోలారు. వ్యవసాయ మోటర్లకోసం ఏర్పాటు చేసిన స్తంభానికి అనుకుని ఉన్న స్టేవైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

నిరసన..

సత్తుపల్లిరూరల్: బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యాన సోమవారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి మాత్రమే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, వీరభద్రం, రాజయ్య, విజయ్‌కుమార్, రవికుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, చంద్రశేఖర్, వెంకట్రావ్, గణేష్, సీతారాం పాల్గొన్నారు.

రైతులందరికీ 'భరోసా' ఇవ్వాలి



మాట్లాడుతున్న బిక్కి కృష్ణప్రసాద్

మధిర: రైతులందరికీ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని మధిర రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. రైతుల నుంచి రైతు భరోసా పథకంపై సూచనలు, సలహాలు స్వీకరించే కార్యక్రమాన్ని సోమవారం మధిర సొసైటీ ఆధ్వర్యంలో మధిర రైతు వేదిక వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి డీఎన్ శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారి సింధూర్, రైతులు మాదల రామారావు, వెంకట నాగేశ్వరావు, ఉద్దండ రెడ్డి, కోటేశ్వరరావు, పుల్లారావు, సీతారామయ్య, నర్సిరెడ్డి, గోవిందరాజు, నరసింహారావు, సంఘ సెక్రటరీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

13నుంచి శిక్షణా తరగతులు

మధిర: ఈ నెల 13 నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. సోమవారం స్థానిక బోడెపుడి భవన్‌లో నిర్వహించిన పార్టీ పట్టణ, మండల కమిటీల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణా తరగతుల్లో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు శీలం నరసింహారావు, నాయకులు సైదులు పాల్గొన్నారు.

వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనది

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని పలువురు వక్తలు వైద్యుల సేవలను కొనియాడారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రాల్లో వైద్యాధికారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా: డాక్టర్ మురళీకృష్ణ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది, తదితరులు


తల్లాడలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


మధిరరూరల్: మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యుడు వీరబాబుని సన్మానిస్తున్న గ్రామస్తులు, సిబ్బంది